

# వృద్ధజంబుకం

రచన

శ్రీ 'అమరేంద్ర'

"వెండి పన్నెండు తులాలు"

"అయితే బంగారం ?"

"బంగారమా ? అంతా కలిపినా మూడు తులాలకి మించదు"

"భలేవారు! ఏం మాటలండీ ? ఈ గొలుసూ, గాజులూ—"

"అవన్నీ దొంగబంగారం! గిల్టుకీ, బంగారానికీ తేడా తెలుసుకోలేనంత వెర్రివాణ్ణనుకున్నావుట్రా ?" అని తొట్రుపాటులేని తీవ్రస్వరంతో అన్నాడు ధనంజయగుప్త. దాంతో చెవులకి వేళ్లాడ కట్టిన దళసరి అద్దాల కళ్లజోడు ముక్కు చివరికి జారింది. ముసలిముఖంమీద నరాలు పాముల్లాగా మెలికెలు తిరిగి కనిపిస్తున్నయ్. గదిలో ఆముదపు దీపం మసకగా వెలుగుతోంది. చిత్తాపుస్తకాలు దొంతరలుగా పడివున్నయ్. ఆ దీపం గుడ్డివెలుతురులో ఇనపపెట్టె తాళం తళుక్కున మెరుస్తోంది.

"ఏమిట్రా అల్లా చూసావ్ ? నామాట నమ్మకం లేదా ? అయితే తీసుకుపో. అవతలికి ఎవడిక్కావాలిరా ఈ పాడు సొమ్ము!" అని గుప్త గర్జించాడు.

ఆ గర్జన వినేసరికి పెద్దపులిలాంటి దొంగల నాయకుడు కాస్తా పిల్లి అయిపోయాడు. ఆయనకి కోపం వస్తే కొంప మునిగిపోతుంది. తన ఆట కట్టేసుంది. అంత పెద్ద షావుకారు అండ తనకి మళ్ళీ దొరుకుతుందా ? వెండి బంగారాలే కాక, ధాన్యం, గుడ్డలూ, కూడా అమ్మి గుప్త ధనం గుట్టలు పోసుకున్నాడు. అంతేకాదు ఆ వూరి పంచాయతీబోర్డు అధ్యక్షుడు అధికారులందరికీ తలలో నాలుకలాటివాడు. ముఖ్యంగా ఆ ఠాణాలో

పోలీసు ఇన్‌స్పెక్టరు గుప్తగారి ముఖ్య స్నేహితుడు. ఇవన్నీ గుర్తు తగలగానే ఆ గజదొంగ గజగజ వణుకుతూ, “కోపగించకండి షావుకారుగారూ! బొత్తిగా అన్యాయంచేస్తే చచ్చిపోతాం స్వామీ,” అని బతిమాలుకున్నాడు.

“ఇంక మాట్లాడి లాభంలేదు. నే నెవళ్లకీ అన్యాయం చెయ్యనురా. పరలోకం అంటూ ఒకటుందని నే నెరగనా? ఇష్టమైతే రెండొందలు తీసుకుని పో. లేకపోతే వచ్చినదారిని వెళ్లిపో, అట్టే గొడవ చెయ్యకు.”

“బీదవాళ్లం. అన్యాయంగా చచ్చిపోతాం. ఇంకో పాతిక ఇప్పించండి.”

“ఇంకొక్క పైసాకూడా ఇవ్వను తెలిసిందా. కావాలంటే మీ సొమ్ము తీసుకుపోయి ఇష్టమొచ్చినచోట అమ్ముకోండి. ఇంకెవరైనా సరే వీటికి నూటపాతిక్కంటె ఒక్క కానీ ఎక్కువిస్తే నా చెవి తెగకోయించుకుంటాను. ఏదో పాపం పాత ఖాతా కదా అని రెండొందలు ఇస్తానంటే ఇంకా కొండెక్కి కూచుంటారేరా?”

“సరే బాబూ మీ చిత్తం ఆ రెండొందలే దయచెయ్యండి.”

ధనంజయ గుప్తముఖాన మందహాసం మెరిసింది. “ఎందుకురా నామీద మీ కింత అనుమానం? ఇది మీ కష్టార్జితం కదా, ఇందులో మిమ్మల్ని మోసం చేస్తే భగవంతుడు నన్ను బతకనిస్తాడురా? ఈ జన్మలో కాకపోయినా ముందుజన్మలోనైనా ఈ పాపం నన్ను వెన్నంటుతూనే వుంటుందిరా. ఎప్పటికైనా ధర్మమే జయించుతుంది. అధర్మానికి పుట్టగతులు లేవు. అన్యాయపుసొమ్ము ఆవు మాంసంతో సమానం కాదుట్రా నాయనా?” అని అనర్గళ ధర్మప్రవచనాలతోపాటు రెండొందల రూపాయలు వాళ్లకిచ్చి సాగనంపాడు. తలుపు గట్టిగా బిగించుకున్నాడు.

గజదొంగ తిరపతిరాయుడు పళ్లు పటపట కొరుకుతూ పిడికిలి బిగపట్టి, “ధర్మపన్నాలు చెబుతున్నాడు ముసలిపీనుగు. అన్యాయపు సొమ్ము అవుమాంసంతో సమానంట. ముసలినక్కని ముప్పతిప్పలు పెట్టి మూడు చెఱువుల నీళ్లుతాగించకపోయానా? కాని –” అంటూ రగిలే కోపాన్ని లోలోపల దిగమింగుకుంటూ వెళ్లిపోయాడు.

ఎంత ప్రయత్నించినా గుప్తకి నిద్ర పట్టలేదు. బైట ఆకు అల్లాడితే చాలు గుండెలు ఝల్లుమంటున్నయ్. మధ్యమధ్య పొలాల నుంచి నక్కల అరుపులు వినిపిస్తున్నయ్. దీపం కొంచెం పెద్దదిచేసి నగలమూట విప్పి ఒక్కొక్కటీ విడివిడిగా ఖరీదు కట్టాడు. కనీసం రెండువేల ఖరీదు చేస్తయ్. చాలా కొత్తమోస్తరు నాజూకు నగలు. పాపపుసొమ్ము ఆవు మాంసంతో సమానం. అయినా ఆ పాపమంతా దొంగలకే తగులుతుంది కాని తన కెందుకు అంటుతుంది? అయినా తను పరమభక్తుడు. అర్ధరాత్రివేళ వొణుకుతున్న కంఠంతో కృష్ణకర్ణామృతం పారాయణ చేస్తాడు. పాపాలు దూరంగా పారిపోకుండా ఎన్ని గుండెల్తో నిలబడగలవు? ఈ పారాయణతోనే భళ్లున తెల్లవారిపోతుంది. ధనంజయం నిద్రనికూడా ఎన్నడో జయించాడు!

ఇంకా పూర్తిగా తెల్లవారకముందే ధనంజయం కాలకృత్యాలన్నీ పూర్తిచేసి, కోరా ఖద్దరు కొల్లాయిగుడ్డ ధరించి భగవద్గీత ముందు పెట్టుకుని కూచుంటాడు. తెల్లవారేసరికి గాజుగ్లాసునిండా ఆవుపాలు పోసి తీసుకువస్తుంది కామాక్షి. ఆవుపాలమీదా, ఆయుర్వేద వైద్యంమీదా ఆయనకి ఎంతో అభిమానం!

రోజూకంటే కొంచెం ఆలస్యంగా వొచ్చింది కామాక్షి. పొద్దున్నే తలంటి పోసుకుని కళ్లకి కాటుక పెట్టుకుని నీటుగా వచ్చింది. ఆమె సోయగం ముసలి ధనంజయాన్ని గిలిగింతలు పెట్టింది. “ఎంత బాగున్నావే కామాక్షీ! రోజురోజుకీ నువ్వు పడుచుపిల్లవై పోతున్నావే,” అన్నాడు.

“ముసలితనం వొచ్చినకొద్దీ రసికత్వం ఎక్కువై పోతోంది.” అంటూ ముఖం తిప్పేసుకుంది కామాక్షి.

“ఇదుగో ఇల్లారా...” అన్నాడు ధనంజయం గుటకలు మింగుతూ.

“ఏమిటి మీ కేమైనా మతిపోయిందా? ఎవరైనా వింటే—”

“ఆ మతిపోలేదు. మత్తెక్కింది. నీ అందాన్ని చూస్తే ఎవరికి మతిపోకుండా వుంటుంది? ఇదుగో ఇల్లా రా. నీ కోసం కొత్తరకం నగలు తెప్పించాను.”

“వొద్దులెండి. నా మొహానికి అంత అదృష్టమా?”

“అదేమిటే కామాక్షీ, అల్లా గంటావు? ఎప్పుడూ ఏమీ ఇవ్వనట్లే మాట్లాడుతున్నావే?”

ఇంతలో గణగణమని సైకిలుగంటా, టకటకా బూట్లచప్పుడూ, “ఇంట్లో వున్నారా, గుప్తగారు?” అన్న పిలుపూ వినిపించినయ్. పానకంలో పుడకలాగా అధికారి అదే సమయానికి తయారయాడు.

ధనంజయుని ముఖం పాలిపోయింది. ఆ చప్పుడు వినేసరికి కామాక్షిముఖం చిరునవ్వుతో మెరిసింది. ఆ పాదమస్తకమూ సిగ్గుతో పులకరించిపోయింది. ఒక్కసారిగా ఆనందతరంగం ఆమె అణువణువులోనూ చెలరేగింది. శిలలమీద త్రుళ్ళిపడే సెలయేరులాగా కామాక్షి ఒక్క గంతు వేసి బైటికి వెళ్ళింది. పాతసంగతే అయినప్పటికీ కొత్తబాధ, అసూయ ధనంజయ గుప్త గుండెలని భగ్గుమనిపించినయ్. కామాక్షి అందం, ఇనప్పెట్టెలో డబ్బూ ఇవి రెండూ తనవే కాని తను అనుభవించలేనివి. వీటి రెంటినీ భద్రంగా కాపలాకాయటమే తనవొంతు కాబోలు...అసూయతో మనస్సు విరిగిపోయింది.

ఇవాళ అధికారి ఎందుకో చిర్రుబుస్సుమంటున్నాడు. చేతులో లాఠీని ఊగిసులాడిస్తూ, “గుప్తగారూ! మీరు కొంచెం జాగర్తగా మెలగాలి. అడ్డగోలువ్యవహారం చేశారంటే మీ మూలంగా నా వుద్యోగం వూడిపోతుంది” అన్నాడు.

“చిత్తం, బాబూ, చిత్తం,” అని ధనంజయం రెండుచేతులూ నలుపుకున్నాడు.

“పైనుంచి పదేపదే తాఖీదు లొస్తున్నయ్. ఖర్మంజాలక మీపేరు బైటికి పొక్కితే నేను చేసే దేమీ లేదు. మీకు తెలుసుగా, పై అధికారి చాలా అసాధ్యుడు. వాడి కేదైనా మేత పడేసి వాణ్ని కట్టుకుంటేగాని—” అని అధికారి అనటమే ఆలస్యంగా ధనంజయగుప్త గభాలున పెట్టె తెరిచి ఒక నోట్లకట్ట తీసుకొచ్చి అధికారిచేతి కిచ్చాడు. ఇవ్వటమే తడవుగా అధికారి ఆ కట్టని నిర్లక్ష్యంగా నిక్కరుజేబులో వేశాడు ప్రసన్న దరహాసంతో అధికారిముఖం విప్పారింది.

ఇంతలో కామాక్షి అతిథికి ఆఖరిసత్కారంగా వెండిపళ్లెంలో తమలపాకు చిలకలు తెచ్చి అందించింది. వాటిని సావకాశంగా నములుతూ, “అయితే గుప్తాగారూ, మీదగ్గి రేమైనా బియ్యం నిల్వ వున్నదా? నిజం చెప్పండి. నేను పైవాళ్లకి రిపోర్టు పంపాలి,” అన్నాడు అధికారి.

“బియ్యమా? నాదగ్గిరా? ఎక్కణ్నించి వొస్తయ్ బాబూ? పండినవి కాసినీ అప్పుడే అయిపోయినయ్. నేనూ అందరిలాగే రేషనుబియ్యం కొనుక్కుని నానా ఇబ్బందీ పడుతున్నాను.”

“అబద్ధం – పచ్చి అబద్ధం నాకేమీ తెలియదనుకున్నారు కాబోలు. ఈ నిమిషంలో మీకొట్లు తనిఖీ చేస్తే అయిదొం

వందల బస్తాలు దొరుకుతయ్. మీ నక్క జిత్తులు నా దగ్గరా?" అని క్రూరంగా నవ్వాడు అధికారి.

"హరే కృష్ణ - హరే కృష్ణ.....నా కొంట్లో అయిదొందల బస్తాల బియ్యమా? ఎవరో గిట్టనివాళ్లు కూసిన కూత. మీముందు దాస్తానా? అధికారులతో అబద్ధం ఆడితే మహాపాపం చుట్టుకోదుటండీ? ముందు జన్మలో నాకు పుట్టగతు లుండొద్దూ?"

"చాలుచాలు వూరుకోవయ్యా! ధర్మపన్నాలు ఏకరువు పెడతా వెందుకు? అమ్మ పుట్టిల్లు మేనమామదగ్గర దాస్తావా? నీకేం భయం లేదులే. నే నున్నంత కాలం. నువ్వు నిశ్చింతంగా నిద్రపోవచ్చు."

"తమ ఆసరా లేకపోతే ఈ దీనుడు నిమిషమైనా బతకగలడా?" అని ధనంజయం అధికారిచేతులు పుచ్చుకున్నాడు.

"సరే వెళ్లొస్తాను" అంటూ కామాక్షి వైపు ఒక చూపు విసిరి సైకి లెక్కాడు అధికారి.

అధికారిని సాగనంపి కామాక్షి వంటపనిమీద ఇంట్లోకి వెళ్లిపోయింది. అసలు కామాక్షి ఎవరో, ధనయంజయగుప్తతో ఆమె కేం సంబంధమో ఎవరికీ అర్థంకాదు. పలభయొ్యపదిలో ఆయన పెళ్లాం పోయింది. తరవాత కొన్నాళ్లకి కామాక్షి వంటమనిషిగా చేరి క్రమేణా ఇంటి మనిషిగా మారింది. ఇంతవరకూ ఎన్ని దురాగతాలు చేసినా ధనంజయగుప్త ఒక్కసారి కూడా పట్టుబడకపోవటానికి ఆమే కారణమని అందరికీ నమ్మకం. చండశాసనుడని పేరుమోసిన అధికారి, ధనంజయగుప్త ఇంటి చుట్టూ కాలుకాలిన పిల్లిలాగా తిరగటానికీ, కోరలు తీసిన పాములాగా మారటానికీ కామాక్షి ఇంద్రజాలమే కారణమని అందరికీ తెలుసు.

అక్కడే చతికిలబడిపోయాడు గుప్త. గుండెల్లో రాయిపడింది. ఎల్లా తెలిసిందో తన దగ్గర బియ్యం వున్నట్లు? ఇంకా నయం తనదగ్గర ఎనిమిది వందల బస్తాలు నిలవున్నట్లు తెలియలేదు. ధర్మంగా వ్యాపారంచేస్తే మట్టికొట్టుకుపోవలసిందే కదా? ఈ బియ్యం తను తేలికధరలో కొన్నమాట నిజమే. కాని కార్తీకమాసంలో కటకటగావుంటే రోజుల్లో సరుకు విడుదలచేస్తే కోరిన ధరకి కళ్ళు కద్దుకొని కొనుక్కుపోతారు. తను కుబేరుడైపోవచ్చు. ఇంతకీ అధికారి చల్లగా చూసినంత కాలమూ తన కే భయమూ లేదు.

ఇల్లా అనుకుంటూవుండగానే ఆ వూరి షావుకార్లు ముగ్గురు లంబోదరులు త్రిమూర్తుల్లాగా ప్రత్యక్షమయ్యారు. "ఊరక రారు మహాత్ములు. ఏమిటి విశేషం?" అని ఆత్రంగా అడిగాడు ధనంజయం.

"ఆ ఏం లేదు - మన వూళ్లో సప్తాహం జరపాలని నిశ్చయించాం. కలియుగాంతం దగ్గరికి వచ్చేస్తున్నకొద్దీ పాపం పండిపోతోంది. ఏదో కాస్త నలుగురం ఒకచోట చేరి భగవన్నామస్మరణ చేస్తే మంచిదని ఈ సప్తాహం ఏర్పాటుచేస్తున్నాం."

"ఈ కలికాలపు పాపాలన్నిటికీ అదే మంచి విరుగుడు," అని ధనంజయగుప్త అంగీకారం తెలిపాడు.

"అయితే తమరు తప్పక దయచేసి భూరి విరాళం ఇచ్చి సప్తాహాలు జయప్రదంగా జరిపించాలి." అని ముగ్గురు వర్తకులూ ఒక్క కంఠంతో అన్నారు. అల్లాగే లెండి అన్నాడు గుప్త.

మర్నాడు బ్రహ్మాండమైన సన్నాహాలు జరిగినయ్. సభికులకోసం పెద్ద పందిలి వేశారు. మధ్య భజనలకీ, ఉపన్యాసాలకీ ఎత్తుగా వేదిక అమర్చి దాన్ని దీపాల తోరణాలతో చక్కగా అలంకరించారు. తప్పెట్లతో, తాళాలతో, రకరకాల వాద్యాలతో క్షణంకూడా విరామం లేకుండా భజనలు సాగిపోతున్నయ్. తను కూడా చిరతలు చేత పుచ్చుకుని పూనకం పూనిన వాడిలాగా ధనంజయం భక్తిపారవశ్యంలో ఊగిపోతున్నాడు. ఇంతలో అమాంతంగా లేచి నిలబడి ఉపన్యాసకేసరి పలుగురాళ్ల లాటి సమాసాలతో, కలికాలంలో ధర్మం ఎల్లా భ్రష్టమైపోతోందో వర్ణిస్తూ ప్రేక్షకులమీద పిడుగులు కురిపించటం మొదలెట్టేసరికి అంతా కిక్కురు మనకుండా చెవు లప్పగించి వింటున్నారు. గంభీరంగా ఉపన్యాసం సాగిపోతుంటే మధ్యలో, "ధనంజయగుప్తాగారూ! తమరు వెంటనే రావాలి" అని కేక వినిపించింది. గుప్త ఉలిక్కిపడి లేచి నిలబడి ఆ వొచ్చిన మనిషి పంచాయతీబోర్డునౌకరని గుర్తించి, "ఏం కొంప మునిగిందిరా? భగవన్నామస్మరణకూడా తీరుబాటు దొరక్కుండా వుందే. బాగానే వుందే ఈ జీతం బత్తెం లేని వుద్యోగం." అని విసుక్కున్నాడు. ఈ జీతం బత్తెం లేని ప్రెసిడెంటుహోదా కోసమే గుప్త కొన్నాళ్లకిందట డబ్బు సంచులు విరజిమ్మాడు.

"త్వరగా రావాలి బాబూ," అని నౌకరు రెట్టించాడు.

"మీరు కార్యక్రమం సాగిస్తూవుండండి, నే నిప్పుడే తిరిగి వొస్తాను," అని ధనంజయగుప్త పందిలిబైటికి వచ్చాడు.

"ఏమిట్రా గొడవా?" అని విసుగ్గా అడిగాడు.

"కూరగాయల గురవయ్యపెళ్లాం గొంతు కురిపోసుకుని చచ్చిపోయింది."

"అయితే గురవయ్యో?"

"గురవయ్యకూడా పోయాడు పాపం."

"పోనీ పీడ విరగడైపోయింది. అయితే ఇప్పుడు శివపంచాయితీ జరపాలన్నమాట పద పోదాం. పెళ్లాం ఉరిపోసుకుని చచ్చిందన్నావు. మరి మొగుడెల్లా పోయాడూ?"

"ఏం చెప్పను బాబూ? వాళ్లకి గడ్డు రోజులు వొచ్చినయ్. తిండికి లేక మలమల మాడి చచ్చిపోయారు. ఆకలిచిచ్చుకి తాళలేక నే వాడిపెళ్ళాం వురిపోసుకుంది."

"అల్లాగా?"

"అవును, బాబూ! ఆకాశాన్నంటుతున్నయ్ ధరలు. ఈరోజుల్లో బీదా, బిక్కా బతకటం చాలా కష్టమైపోతోంది, బాబూ. ఈ కంట్రోళ్లు వొచ్చి మా ప్రాణాలు తీస్తున్నయ్. ఇవాళ గురవయ్యగుడిసెలో జరిగిన సంగతే రేపు నా గుడిసెలోనూ జరగచ్చును."

"చాల్లేరా, ఒకటే సొద. పోయేవాళ్లని పట్టుకుంటే ఆగుతారా? ఎవరికాలం మూడితే వాళ్లు పోతారు. ఎప్పుడో ఒకప్పుడు అంతా పోయేవాళ్లమే గదా! వాళ్లు ఆకలికి మాడి చచ్చారంటే అది వాళ్ళ పూర్వజన్మల కర్మపరిపాకంరా, బాబూ. ఇదంతా ఆ భగవానుడి చిద్విలాసంరా, నాయనా." అని అనర్గళంగా, నౌకరు ఉక్కిరిబిక్కిరై పోయేట్లుగా, ధనంజయగుప్త ఉపన్యసించాడు.

దారి కనపడని కారుచీకటి. జడలు విరబోసుకున్న భూతాలమాదిరి భీకరంగా వున్నయ్ చింత చెట్లూ, రావిచెట్లూ. పొలాలలోంచి గీవురు గావురుమనే ధ్వనులు. వింటుంటే గుప్త గుండెలు పీచుపీచు మంటున్నయ్. ఏదో తెలియని భయంతో వొళ్లు జలదరించిపోతోంది. ఆ చీకట్లో చెట్లగుబుర్లలో ఏవో వికృతమైన నీడలు కదులుతున్నట్లు తోచింది. దగ్గరే వున్న తోపులోంచి సరుకు చెట్ల సవ్వడి అన్నార్తుల ఆక్రందనంగా

గనోక్యూర్
అన్ని సెగలకు గంటలలో గుణము
ఈశ్వర ఫార్మసీ, రాజమండ్రి.

వినిపించింది. "మా అన్నం మా ప్రాణం నీ గుప్పెట్లో చిక్కించుకున్నావు. నీ అధికారం, నీ ధనం, నీ శాసనాలు ఇన్నాళ్లూ నిన్ను మా ప్రతీకారజ్వాలల్లో భస్మం కాకుండా రక్షించినయ్. ఇప్పుడు నిన్నెవరు కాపాడుతారో చూస్తాం, కాసుకో," అంటూ ఎవరో మీదికి దూకుతున్నట్లు తోచి గుండె దడదడలాడింది. ధైర్యం తెచ్చుకుని ధనంజయం గట్టిగా 'హరేరామ, హరేకృష్ణ' అంటూ ఆ చెట్ల గుబురు దాటేసి బతుకు జీవుడా అనుకున్నాడు.

అదే గురవయ్య కూలిపోయిన గుడిసె. అంతా చిందరవందరగా వుంది. గవులు కంపు గుప్పున కొడుతోంది. ముక్కు మూసుకుని 'హరేకృష్ణ, హరేకృష్ణ' అంటూ ధైర్యం తెచ్చుకుని, ధనంజయగుప్త ఇంకో అడుగు ముందుకి వేశాడు. ఆకలికి అల్లాడిపోయి తెన్నుకు కన్నుకుని ప్రాణం విడిచిన గురవయ్య కళేబరం ఎదురుగా కనబడింది. నోరు తెరుచుకునివుంది. బైటపడ్డ పళ్లతో ఆ శవం లోకాన్ని వెక్కిరిస్తున్నట్లుగా కనిపించింది. కళ్లు మరీ భయంకరంగా వున్నయ్. అంతా చీకటిగా వుంది. నౌకరు చేతులో వున్న గుడ్డిదీపం మిణుకు మిణుకుమంటోంది. ఇంతలో ఇంటి కప్పునుంచి వ్రేళ్లాడుతున్న శవం కనిపించి గుప్త గజగజ వొణికిపోయాడు. తన మానాన్ని కాపాడుకోటానికి మిగిలివున్న చినుగుల చీరనే ఆ నిర్భాగ్యురాలు ఉరితాడుగా వుపయోగించింది. నగ్నంగా వ్రేళ్లాడుతున్న ఆ శవం కేసి చూసేసరికి గుప్తకి పైప్రాణాలు పైనే పోయినయ్. పెగుల్చుకున్న గద్గదకంఠంతో "ఇక పదరా పోదాం" అన్నాడు గుప్త.

"మరి ఈ శవాల గతేమిటి, బాబూ?" అన్నాడు నౌకరు.

"వెళ్లి పోలీసులకి చెప్పరా. వాళ్లిష్టం వొచ్చినట్లు చేసుకుంటారు. అబ్బబ్బా! ఏం పాడుగొడవరా ఇది! "హరేకృష్ణ, హరే కృష్ణ" అంటూ ధనంజయం మళ్లీ దారి పుచ్చుకున్నాడు.

సరుకుచెట్ల రొద ఇంకా భీకరంగా వినిపిస్తోంది. దారి పక్కనున్న చెట్లన్నిటినించీ ఎవరో నగ్నంగా వేళ్లాడుతున్నట్లనిపించింది. భయంతో నెత్తురు గడ్డకట్టుకుపోతోంది. అడుగు సాగటంలేదు. ముచ్చెమటలు పోస్తున్నయ్. ఎవరీ ఆత్మహత్యకి కారణం? దైవమా?

"బాబూ, భజన జరిగేచోట దిగబెట్టి రమ్మంటారా?" అని అడిగాడు నౌకరు.

"వొద్దురా, బాబూ. ఇంటికి పోదాం పద. చాలా పనివుంది నాకు," ఎల్లాగో కాళ్లీడ్చుకుంటూ ఇంటికి చేరుకున్నాడు ధనంజయం. సప్తాహం సందడి తప్ప ఊరంతా సద్దుమణిగి నిద్రపోతోంది. మసకచీకట్లో ఇంటిచపారాలో సైకిలు కనిపించింది. లోపలికి అడుగు పెట్టాడు. కామాక్షి పడుకునే గది తలుపు బిగించివుంది. లోపల దీపం లేదు. గుసగుసలూ, ముసిముసినవ్వులూ మధ్యమధ్య వినిపిస్తున్నయ్. ధనంజయం వొంటినిండా గొంగళిపురుగులు పాకుతున్నట్లనిపించింది. నిరాశతో నిస్పృహతో దీనంగా నిట్టూర్చాడు.

మెదలకుండా వెళ్ళి లాంతరు వెలిగించి తీసుకొచ్చాడు. మెల్లిగా బియ్యపు కొట్టు వైపుకు నడిచాడు. కొట్లలో ఎనిమిది వొందల బస్తాల బియ్యం నిలవ పోశాడు. ఆ బియ్యపు రాసే తనకి బంగారపు కొండ!

తలుపు తీసేసరికి బియ్యపురాసి తళతళా మెరిసింది. కాని ఎక్కడిదో పాడువాసన. ఇక్కడికెక్కడా ఆ గవులుకంపు ఎల్లా వొచ్చిందో? చూపులతో అంతా గాలించాడు. కొట్టుమీది రేకులు సందిచ్చినట్లున్నయ్. వాననీళ్లు పడి పైవరసఅంత తడిసిపోయి పాడుకంపు కొడుతోంది ఆర్తుల ప్రాణాలు నిలిపే ఆహారం, భూదేవి ఇచ్చిన మహాప్రసాదం ఈ గుప్తకారాగారంలో పడి కళావిహీనంగా పాలిపోయింది.

కనీసం పదిబస్తాల బియ్యమైనా ధ్వంసమైపోయిన ట్లుంది. "అయ్యో! అయ్యో! కొంప మునిగిపోయింది" అంటూ గుప్త గుండెలు బాదుకున్నాడు. తెల్లారగానే మేస్త్రీని పిలిపించి కప్పుబాగుచేయించెయ్యాలి. ఇంకా నయం. కొన్నాళ్లు చూడకుండా వుంటే మొదటికే మోసంవచ్చేది.

కాని ఏం పాడు కంపు! ఎంత వొద్దనుకున్నా గురవయ్యఇంటిదగ్గరివాసనే గుర్తొస్తుంది. అబ్బా! ఆ శవాలు...హరేకృష్ణ హరేకృష్ణ అనుకుంటూ మనస్సుని బలవంతాన బిగబట్టుకుంటూ, కొట్టుతలుపులు గట్టిగా తాళంపెట్టి, సప్తాహం పందిరి వైపుకి గుప్త బయలుదేరాడు.

---


## నారసింహలేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిశ్శక్తి, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

ఖరీదు డబ్బి రు. 8-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం"
పెరికేపి-నెల్లూరు జిల్లా.